క్లుప్తంగా

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జమ్మికుంట: పంచాయతీ కార్మికులకు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ శైలజకు జూలై 6వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవో నంబర్ 60 ప్రకారం 30 శాతం పీఆర్సీ పెంపు అమలు చేయాలన్నారు. పీఎఫ్, రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, మల్టీపర్పస్ 51 జీవోను సవరించి, కేటగిరీ వారీగా పనులు కేటాయించాలని, కారోబార్లను పంచాయతీ సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం సమ్మెలోకి వెళ్లనున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఎండీగా రవీందర్‌రావు, ఉపాధ్యక్షుడు పోలోజు తిరుపతి, కార్మికులు కొమ్ము శ్రీనివాస్, నల్లగొండ బాబు, దొడ్డె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఆర్పీల బదిలీ

మానకొండూర్: మండలంలోని ఇద్దరు సీఆర్పీలు బదిలీ అయ్యారని మండల విద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. పచ్చునూరు, వెల్ది స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న స్వరూప, సంతోష్ కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు బదిలీ అయ్యారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేయాలి

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలో అంగన్‌వాడీ చెంజర్ల సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ మాట్లాడారు. లబ్ధిదారులకు కోడిగుడ్లను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసేలా చూడాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న గీట్ల ముకుందరెడ్డి

హుజూరాబాద్: ఎల్‌ఎండీలో నీటిమట్టం తగ్గటంతో హుజూరాబాద్ నియోజకవర్గంలో సైతం నీటి ఇబ్బందులు ఎదురవుతాయని, వెంటనే కాళేశ్వరం నీటిని విడుదల చయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది వర్షాలు ఇంకా కురవకపోవంతో ప్రజలు నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నా రని కాళేశ్వరం నీళ్లను వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో హుజూరాబాద్ జోన్ కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, జోన్ కమిటీ సభ్యులు గుండేటి వాసుదేవ్, కదిరె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారుడిన్ని అభినందించిన నాయకులు



అభినందిస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: పట్టణానికి చెందిన ప్రముఖ జాతీయ హాకీ క్రీడాకారుడు పరకాల సన్నీ ఇటీవల జాతీయ క్రీడోత్సవాల్లో భాగంగా తెలంగాణ హాకీ జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. శుక్రవారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. క్రీడా రంగానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు జెల్ల సుధాకర్, నల్ల సుమన్, మోటపోతుల పద్మ, దామెర అనురాగ్, గంగిశెట్టి ప్రభాకర్, రావుల వేణు, నాంపల్లి సుమన్, యాంసాని శశిధర్, మునిగంటి నాగరాజు,గుర్రం సంతోష్, కొలిపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధన నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు ఉద్యోగ సాధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ అన్నారు. శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల కృతజ్ఞత సభ నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడారు. లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, పోటీ ప్రపంచంలో మెరుగైన నైపుణ్యాలు ఉన్న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కల్లెం రవీంద్ర బాబు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకొర మందులు.. అందని పశువైద్యం

- మృత్యువాతపడుతున్న మూగజీవాలు
- మండలంలోని 17 గ్రామాలకు నాలుగు ఆసుపత్రులు
- సరిపోని బడ్జెట్, సమయపాలన పాటించని వైద్యసిబ్బంది



రేకొండలో పశువులకు వైద్యం చేస్తున్న కంపౌండర్

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో అరకొర మందులతో పశువైద్యశాలలు కొనసాగుతున్నాయి. తక్కువ ఆసుపత్రులు, నామమాత్రపు మందుల సరఫరాతో పశువైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రంలో కూడా పశువైద్యశాలలకు సరిగా మందులు అందడంలేదు. రాష్ట్రం సిద్ధించినా పశువైద్యశాలలకు సరిపడా మందులు సరఫరా కావడం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. . ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన బడ్జెట్‌నే ప్రస్తుతం కొనసాగించడంపై పాడిరైతుల నుంచి విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌ను పెంచకపోవడం, అరకొర మందులు సరఫరాతో రైతులు పశువులకయ్యే వైద్య ఖర్చులు భరించాల్సి వస్తోంది.

17 గ్రామాలకు 4 పశువైద్యశాలలు..

మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నాలుగు గ్రామాల్లో మాత్రమే పశువైద్యశాలలున్నాయి. చిగురుమామిడి, ఇందుర్తి గ్రామాల్లో పశువైద్యశాలలుండగా, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో గ్రామీణ పశువైద్యశాలలున్నాయి. చిగురుమామిడి, ఇందుర్తి పశువైద్యశాలల్లో డాక్టర్ల పర్యవేక్షణలో పశువులకు వైద్యసేవలు అందుతాయి. ఇక గ్రామీణ పశువైద్యశాలల్లో కంపౌండర్ల పర్యవేక్షణలో పశువులకు వైద్యసేవలందిస్తున్నారు.

50 వేల పశువులకు అందని వైద్యం

మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం పశువులు, గొర్రెలు, మేకలు, తదితర కలిపి దాదాపు యాభై వేలున్నాయి. ఇందులో గోజాతి పశువులు 10,379, గేదెజాతి పశువులు 8,736, గొర్లు, 20,196, మేకలు 5617, కోళ్లు 7300 వరకు ఉన్నాయి. మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. చిగురుమామిడిలో ఉన్న పశువైద్యశాలకు నాల్గు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సుందరగిరి, పీచుపల్లి, లంబాడిపల్లి, సీతారాంపూర్, చిన్నముల్కనూర్ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో పశువులకు ఏదైనా రోగం వస్తే వాటి తీసుకుని వైద్యశాలకు వచ్చేలోపు చనిపోతున్నాయి. గ్రామానికో పశువైద్యశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు భావిస్తున్నారు.

సరిపోని బడ్జెట్..

పశువైద్యశాలలకు ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ సరిపోవడంలేదు. చిగురుమామిడి, ఇందుర్తి పశువైద్యశాలలకు రూ.30,000, రేకొండ, బొమ్మనపల్లి పశువైద్యశాలలకు రూ.20,000 వేల చొప్పున ఏటా మందులు సరఫరా చేస్తున్నారు. ఈ బడ్జెట్‌వల్ల పశువులకు వచ్చే జబ్బులకు సరిపోవడంలేదు. దీంతో డాక్టర్లు ఉన్న మందులను ఇస్తూ మిగిలిన వాటికి రెఫర్ చేస్తున్నారు. ప్రైవేటుగా రైతులు మందులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తమపై ఆర్థికభారం పడుతుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం బడ్జెట్‌ను పెంచాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

మండలంలోని నవాబుపేట్ గ్రామంలో నూతనంగా పశువుల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పలుమార్లు జిల్లా పశువైద్య ఉన్నతాధికారులకు విన్నవించారు. ప్రభుత్వం ఆసుపత్రిని మంజూరు చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఐదుకిలోమీటర్ల దూరంలోని ఇందుర్తికి పశువులను తొలుకుపోయే పరిస్థితిలేక రైతులు అవస్థలు పడుతున్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది

ఆసుపత్రుల్లో పనిచేసే కొందరు సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉండాలి. మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వర్తించాలి. ఉదయం వేళ మాత్రమే సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాయంత్రం వేళ కొందరు సరిగా విధులు నిర్వర్తించడంలేదని, ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపంతో సిబ్బందికి రివాజుగా మారిందని అంటున్నారు.

చిటుకురోగంతో గొర్రెలు, మేకలు, గాలికుంటు వ్యాధులతో మృత్యువాత పడుతున్న పశువులు.. ఏటా సీజన్‌లో చిటుకురోగంతో గొర్లు, మేకలు, గాలికుంటు, ఇతర రోగాలతో పాడి, ఇతర లోకల్‌జాతి పశువులు మృత్యువాత పడుతున్నాయి. గత ఏడాది కాలంలో ఇప్పటి వరకు దాదాపు 200 నుంచి 300 వరకు జీవాలు మృతిచెందినట్లు గొర్లకాపరులు, పాడిరైతులు ఆరోపిస్తున్నారు. శాశ్వత పరిష్కారం కొనుగొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాడిరైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు చికిత్స



ఏటా ఆయా సీజన్లు వచ్చాయంటే గొర్లు, మేకల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నాం. అలాగే పశువులకు గాలికుంటు, ఇతర వ్యాధులకు ఎప్పటికప్పుడు చికిత్స చేస్తున్నాం. ఉన్న బడ్జెట్, ఆసుపత్రుల్లో ఉన్న మందులను పశువులకు అందిస్తూ వైద్యసేవలు అందిస్తున్నాం.

– శ్రీధర్, పశువైద్యాధికారి, చిగురుమామిడి

సమాచారం

నేడు 10 గంటలు విద్యుత్ సరఫరా బంద్

తిమ్మాపూర్: మండలంలోని అల్గునూరు ట్రాన్స్‌కో పరిధిలోని పోరండ్ల, మన్నెంపెల్లి, మల్లాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దాదాపు పది గంటలు విద్యుత్ సరఫరా ఉండదని, 400 కేవీ మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామకృష్ణకాలనీ జీపీకి వైకుంఠరథం, బాడీఫ్రీజర్



వైకుంఠరథం అందిస్తున్న జగదీశ్వరాచారి

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామపంచాయతీకి సుగుర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి తాతనానమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం వైకుంఠరథం, బాడీఫ్రీజర్ అందించారు. ఈసందర్భంగా సర్పంచ్ మీసాల అంజయ్య మాట్లాడుతూ... గ్రామానికి వైకుంఠరథం, బాడీఫ్రీజర్ అందజేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరాచారి కుటుంబ సభ్యులను సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో నుస్తులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రణీత్ రెడ్డి, అనిల్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, అలువాల అనిల్, శ్రీరామోజు శ్రీనివాస్, వెంకటస్వామి, తెలుకుంట్ల రాము, దాసరి తిరుపతి, బోయిని చంద్రయ్య, వేల్పుల ఎల్లయ్య, అలువాల మల్లయ్య, పండుగ రాజయ్య, అట్ల అంజయ్య, దుర్శెట్టి ఎల్లయ్య, తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలించాలి



తిమ్మాపూర్: పూలమాల వేస్తున్న తహసీల్దార్ కనకయ్య, సర్పంచ్ రమేశ్



చొప్పదండి: మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్



శంకరపట్నం: మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రమేశ్

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రెవెన్యూ అధికారి ఆర్ఐ విజయలక్ష్మి, ఎంపీటీసీ సంపత్, వివిధ శాఖల అధికారులు పాల్గొని మాట్లాడారు. కులవివక్ష లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సం వెలవెలబోయింది. రెవెన్యూశాఖ నుంచి ఆర్ఐ శైలజ మినహా ఏ ఒక్క అధికారి కూడా హాజరుకాలేదు. ప్రజల ఓట్లతో గెలిచిన సర్పంచ్ సైతం స్థానికంగా లేకపోవడంపైసర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీవో, ఇతర అధికారి హాజరుకాలేదు. ఎంఈవో, ఏవో, వైద్య ఆరోగ్య, పోలీసుశాఖల నుంచి ఒక్క అధికారి హాజరుకాకపోవడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రతినెల 30వ తేదీన ఏదో ఒక గ్రామంలో తప్పని సరిగా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాన్ని అధికారులెవరూ పట్టించుకోకపోవడం పై దళితుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా కలెక్టర్ ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకుని హాజరుకానీ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

ఇల్లందకుంట: మండలంలోని మర్రివానిపల్లి గ్రామంలో ఆర్ఐ రవి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. మూఢనమ్మకాలను నమ్మొద్దని, పౌరుహక్కులకు ఎవరు భంగం కలిగించొద్దని, కులం పేరుతో దూషించొద్దని, హక్కులను కాపాడుకునేదిశగా పాటుపడాలని సూచించారు. సర్పంచ్ రాజిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని సాంబయ్యపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ రవీందర్ ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ త్రిపాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్‌లో సర్పంచ్ రావుల రమేష్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ కనుకయ్య, సర్పంచ్ రావులరమేశ్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయన్నారు. దళిత హక్కులు, చట్టాలు, అంటరానితనం నిర్మూలన, బాల కార్మికులచట్టాలు వివరించారు. పౌరులు హక్కులను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాజొద్దీన్ అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షులు పౌరునంది జలపతి, పోలీసులు, అధికారులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

శంకరపట్నం: రెండు గ్లాసుల పద్ధతి వీడాలని వైస్ ఎంపీపీ పులికోట రమేశ్ అన్నారు. మండలంలోని కల్వల గ్రామంలో పౌరహ క్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రతినెల అంటరానితనం అమానుషం అని మొక్కుబడిగా నిర్వహించకుండా పౌరహ క్కుల దినోత్సవానికి అధికారులు హాజరుకావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్ దాసారపు భద్రయ్య, ఏపీవో శారద, ఆర్ఐ అరుణ, హెడ్‌కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, లతీఫ్, కార్యదర్శి చవన్‌లాల్, అంబేడ్కర్ సంఘం నాయకుడు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందకుంట: మాట్లాడుతున్న ఆర్ఐ రవి



చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లో...

కేజీబీవీలో అకాడమిక్ బ్లాక్ ప్రారంభం



అకాడమిక్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: మండలంలోని కేజీబీవీలో శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అకాడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీలను పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



అధ్యక్షుడిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ రవీందర్

చిగురుమామిడి: దళితుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందని, అందుకే దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాల సంఘం ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా ఎన్నికైన బొలుమల్ల రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సహకారంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. మాలలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాల సంఘం పెద్దలు కొప్పుల ప్రసాద్, బీస కనుకయ్య, మాదారి పోచయ్య, నాగెల్లి చిన్న అంజయ్య, బొలుమల్ల జానయ్య, రాగుల ధర్మేదర్, గాజుల జయరాజ్, కొప్పుల భాస్కర్, రాకం అనిల్‌కుమార్, దొంత సదానందం, బొటుమల్ల రాజయ్య, ఆంజనేయులు, మాశం సదికుమార్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇల్లందకుంట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రపంచ దేశాలు మోదీని ఆదర్శంగా తీసుకున్నాయని, ఇక్కడి ప్రతిపక్షాలు మోదీ ప్రభుత్వాన్ని దెబ్బతీయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ఈసందర్భంగా నాయకులు కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, తమిళనాడు రాష్ట్రానికి చెందిన అప్పకాలిక విస్తారక్ వెత్రీవల్ మురుగన్, శక్తికేంద్ర ఇన్‌చార్జి అబ్బిడి తిరుపతిరెడ్డి, బూత్ అధ్యక్షుడు మద్దూరి మల్లేశం, బెల్లం హరీష్, రమేష్, నరేందర్‌రెడ్డి, రాజమల్లు, లింగయ్య, ఎండీ రాజా అంకుషావళి, చంద్రయ్య, ప్రశాంత్‌రెడ్డి, కుమార్, సదానందం, మొగిలి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ



పరామర్శిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి, కరీంపేట, కేశవపట్నం, చింతగుట్ట గ్రామాల్లో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. వెంట పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, ఉపసర్పంచ్ కుమార్, సదాశివరెడ్డి, ఇసామొద్దీన్, ప్రవీణ్, కిష్టస్వామి, సదానందం, చంద్రమౌళి ఉన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన బుర్ర జగదీశ్వర్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకుడు వొడితెల ప్రణవ్ పరామర్శించారు. వెంట మాజీ ఎంపీటీసీ ఈరెల్లి సమ్మయ్య, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జోంగోని రాజ్ కుమార్, వార్డ్ మెంబర్ వేల్పుకొండ శ్రీనివాస్, యూత్ నాయకులు రాకేశ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి చెందిన ఉప్పరి హాసిని ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్న యాదవ్ పరామర్శించారు. వెంట యాదవ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు కొండయ్య, కొమరయ్య, గాలి రమేష్, కాల్వ శ్రీనివాస్, తోడంగ కొమురయ్య, యాదవులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ జన్మదిన వేడుకలు



వేడుకల్లో మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట మార్కెట్ యార్డులో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ జన్మదిన వేడుకలను మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మురళీ, నాయకులు శ్రీనివాస్, ఎల్కపల్లి లచ్చయ్య, రాజమౌళి, అంజి, మునీందర్, సాగర్, రాజయ్య పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని బూరుగుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జన్మదినం పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎమ్మెల్యే రవిశంకర్ కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.